నేనూ ఒక టీచర్ నే : పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నేను ఒకప్పుడు టీచర్ గానే పని చేశాను. ఇన్స్టిట్యూట్ల సమస్యలు, విద్యార్థుల అవసరాలు నేను కళ్లారా చూశానని టీడీపీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. స్థానిక స్టెమ్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సెమినార్లో పెమ్మసాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుంటూరు బిషప్ రెవరెంట్ డా.సీహెచ్. భాగ్యయ్య, విజయవాడ బిషప్ రెవరెంట్ డాక్టర్ టి.రాజారావు నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. సెమినార్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తన చిన్నతనంలో రావిపాడులోని క్యాథలిక్ స్కూల్లో చదువుకున్నానని, అప్పట్లో ప్రతి ఆదివారం చర్చికి వెళ్లేవాడినని తెలిపారు. విదేశాలలో మెడిసిన్ పూర్తయిన తర్వాత జన్మభూమికి ఏమైనా చేయాలనే తలంపుతో తిరిగి వచ్చానన్నారు. విద్యార్థుల్లో సాధారణంగా ఆర్థికపరమైన ఇబ్బందులు చాలా మందికి ఉంటాయని, వారికి కూడా అందుబాటులో ఉండేలా తన వద్ద ఉన్న మెడికల్ మెటీరియల్ను జర్నల్గా చేసి అందించానన్నారు. బ్రదర్ డాక్టర్ భరత్ రెడ్డి, బ్రదర్ డాక్టర్ భాటియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా మహేంద్ర బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-దుగ్గిరాల : దుగ్గిరాల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా మహేంద్ర శని వారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మహేంద్ర గతంలో మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా దుగ్గిరాల రావడం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రతాప్ తాడేపల్లి బదిలీపై వెళ్లారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

విద్యార్థులకు ఓటుపై అవగాహన

విశాలాంధ్ర-మంగళగిరి : విజయ హెల్త్కేర్ ట్రస్ట్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శనివారం ఓటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మంగళగిరి నగరంలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థులకు ఓటు హక్కుని సద్వినియోగ పరచుకునే విధంగా సలహాలు సూచనలు చేశారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగినది. విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఉడత శ్రీనివాస్, యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, జై.లక్ష్మి, నారాయణ ప్రసాదు, కొమ్మాకుల విజయ భాస్కర్, హెల్త్ కేర్ ట్రస్ట్ సభ్యులు తల్లా చెంచురెడ్డి, బొడ్డేటి రమేష్, కాట్రు శ్యామ్, జ్యోతి పాల్గొన్నారు.

కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు శివారులో నెలకొన్న కళ్ళం హరనాథరెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నందు శనివారం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడినవని కళాశాల డైరెక్టర్ డా.యం.ఉమాశంకరరెడ్డి తెలి పారు. ముఖ్యఅతిథిగా హైకోర్ట్ జడ్జి ఆకుల వెంకట శేషసాయి హాజరై మాట్లాడారు. అన్నిదానాలో కెల్ల విద్యాదానం గొప్పదని తెలియ జేసారు. సమిష్టిగా కలసి చర్చించుకుంటే ఎటువంటి సమస్య లైనా పరిష్కరించుకోగలమని సూచించారు. సభలో కళాశాల ఛైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి. ప్రిన్సిపల్ డా.బి. యస్.బి. రెడ్డి, ఉపాధి, కల్పన విభాగాధిపతి డా. పి.యల్. మాధవరావు, ఏట కళ్ళం నవ్య, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

'మురుగుడు లావణ్య' దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మిద్దే సెంటర్లోని శ్రీ బాల గణపతి దేవాలయంలో శనివారం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్గా నియమితులైన మురుగుడు లావణ్య, సత్యం దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోలి లింగయ్య రామాలయం, శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి వారి దేవస్థానం, గణపతి నగర్ శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవాలయాలలో శ్రీ స్వామి వార్లకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సతీమణి మురుగుడు సామ్రాజ్యం, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, శివ నాగేంద్రరావు దంపతులు, వైసీపీ నాయకులు బల్లా శ్రీనివాసబాబు, జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(జేపీ), షేక్ నశీముల్లా, మున్నంగి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 10 వరకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచ వినికిడి సందర్భంగా స్థానిక కొత్తపేట డాక్టర్ ప్లాజాలోని స్నేహిల్ అండ్ హియరింగ్ రీహెబిలిటేషన్ సెంటర్లో ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ (ఏపీ ఏఎస్ ఎల్పీఏ) ఫౌండర్, స్నేహిల్ స్పీచ్ అండ్ హియరింగ్ రీహెబిలిటేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్, ఆడియాలజిస్ట్ ఆర్.శిరీష శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారు ఈ ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులలో వినికిడి లోపాన్ని సరిచేయకపోతే జ్ఞాపకశక్తి మందగిస్తుందని, ఇతర మానసిక సమస్యలు కూడా దారి తీస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా పిల్లల్లో వినికిడి లోపం సరి చేయని ఎడల మాట్లాడలేకపోవడం, సాధారణ మానసిక అభివృద్ధి లేకపో వడం వంటి సమస్యలు దారితీస్తాయని స్పష్టంచేశారు. వినికిడి లోపం ఉన్నదని తెలిసిన వెంటనే ఈఎన్టీ, ఆడియాలజిస్టును సంప్రదించి.. వినికిడి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వినికిడి మిషన్, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అతి చిన్న వయస్సు లోనే వినికిడి సమస్య గుర్తించి చెవిటి మిషన్లు అమర్చి వారికి స్పీచ్థెరపీ ఇచ్చి సాధారణ పౌరులుగా చేయవచ్చన్నారు. మాట అస్పష్టత, ఆటిజమ్, నత్తి తదితర మాట సమస్యలు ఉన్న వారికి స్పీచ్థెరపీ ద్వారా వాళ్ళను సామాన్య పౌరులుగా చేయగలమని డాక్టర్ శిరీష పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE 3rd ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA.

I.A.No.15/2024 in O.S.No.15/2024

Between:
Nidumukkala Sobhan Babu, - Plaintff
and
Cherukupalli Ram Bharadwaj - Defendant

To
Cherukupalli Ram Bharadwaj,
S/o. C.V.N.R.K.K.Prasad,
R/o. Door No. 13-38-5-3, Akshita Nilayam, Seetanagaram, Tadepalli Post & Mandal, Guntur District. AP. 522501.

పై నెంబరు దావాలో పై ఉదహరించిన పిటీషన్ యందు శ్రీ కోర్టువారు తమకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినా, తమరు తీసుకోనందున, శ్రీ కోర్టువారు **ది.26-02-2024వ తేదీన** పత్రికా ముఖముగా నోటీసులు జారీ చేయుటకు అర్డరు జారీ చేసియున్నారు. కావున తమరు **ది.19-03-2024 తేదీ ఉదయం గం. 10.30ని॥లకు** మీరుగాని లేక మీ తరపున న్యాయవాది గారు గాని హాజరు అయ్యి తమ యొక్క అక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యడల శ్రీ కోర్టువారు పై ఉదహరించిన పిటీషన్ తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది: 19-03-2024.
ఉదయం గం.10.30 ని॥లకు

D. Butchi babu, B.Sc. BL,
తరపు అడ్వకేట్,
సత్యనారాయణపురం,విజయవాడ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

– జనసేన నేత నాదెండ్ల మనోహర్కు వినతిపత్రం అందజేసిన ముప్పాళ్ల

విశాలాంధ్ర-తెనాలి : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు శుక్రవారం తెనాలి నియోజకవర్గ జనసేనపార్టీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్కు విజ్ఞాపన పత్రం అందజేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసం కారణంగా ఆర్థికంగా నష్టపోయిన 10 లక్షల మంది డిపాజిట్దారులకు, ఇంటిస్థలాలు, వ్యవసాయ భూములు కొన్న బాధితులకు న్యాయం చేయాలని, ఈ అంశం జనసేన పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని, బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ కంపెనీకి వేలకోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చడంలో నేటి ప్రభుత్వం గత ఎన్నికల ముందు, ఎన్నికల అనంతరం, అధికారం చేపట్టిన తర్వాత కూడా ఇచ్చిన మాటలను ఆచరణలో పెట్టలేదని, బాధితుల సమస్యలను పరిష్కరించకుండా మిన్నకుండిపోయిందని ముప్పాళ్ల వివరించారు. బాధితుల ఆందోళన ఫలితంగా అరకొర చెల్లింపులే చేసిందని, ఈ విషయమై తమ పార్టీ పరిశీలించి అగ్రిగోల్డ్ అంశాన్ని పరిష్కరించేందుకు తోడ్పడాలని కోరారు. మన రాష్ట్రంలో సుమారు 500 పైగా కస్టమర్లు, ఏజెంట్లు ఈ నష్టాల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మ హత్యలకు, అసహజ మరణాలకు గురయ్యారని వివరించారు. అయితే మరణించిన బాధిత కుటుం బాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ఇస్తామని గొప్పగా ప్రకటించి, ఒక్కరికి కూడా ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు అనే స్కీముల పేరుతో కంపెనీ అమ్మగా కొనుగోలు చేసిన వేలాది మంది అమాయకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం మాట తప్పిన నేపథ్యంలో బాధితులకు న్యాయం చేసేందుకు తమ పార్టీ చొరవ తీసుకోవాలని విజ్ఞాపన పత్రంలో కోరారు. కార్యక్రమంలో తెనాలి ప్రాంత అసోసియేషన్ నిర్వాహకులు బషీర్, చెరుకుమల్లి సింగారావు, కిరణ్బాబు, పాశం వెంకటేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రానికి సమాజానికి అంతర్గత సంబంధం ఉంది

– ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనిర్సిటీ లోని న్యాయకళాశాల ఆధ్వర్యంలో ప్రోబోనో క్లబ్ను శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. న్యాయశాస్త్రానికి సమాజానికి అంతర్గత సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రాథమిక హక్కులు పుట్టినప్పటినుంచి మనకు ఉన్నాగాని, అవి రాజ్యాంగంలో పొందుపరిచిన తరువాతనే తప్పనిసరి చేయబడ్డాయన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారది వర్మ మాట్లాడుతూ తమ వర్సిటీలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ను వీసీ డాక్టర్ జి.పార్థసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేబీ సుందర్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సురేష్ కురివెళ్ల, కేంద్ర న్యాయ శాఖ ప్రోగ్రాం మేనేజర్ స్నేహ శర్మ, కేఎల్ వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారది వర్మ, విభాగాధిపతి విజయసుధ, ఆచార్యులు డాక్టర్ కామసాయి, అసిస్టెంట్ ఆచార్యురాలు, ఆర్.చాందిని చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో గెలిచేది వైసీపీనే

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్గా నియమితులైన మురుగుడు లావణ్య గెలుపు ఖాయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శనివారం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికలు మంగళగిరిలో నాన్ లోకల్, బీసీ అభ్యర్థి మధ్య పోటీ జరుగుతుందన్నారు. వైసీపీ తరపున పోటీ చేస్తున్న లావణ్య గెలుపు ఖాయమని అన్నారు.

సృజనాత్మకతకు అద్దం పడుతున్న మాంటిస్సోరి సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో దోహద పడతాయని మాంటిస్సోరి స్కూలు కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ప్రిన్సిపల్ కె.వి సెబాస్టియన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నగరంపాలెంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో మంటిస్సోరి క్రియేటివ్ ఎక్స్ప్రో నిర్వహించారు. విద్యార్థులు తరగతి గదిలో చదువుకునే పాఠ్యాంశాలను ప్రయోగ రూపంలో ఆ విద్యార్థి తయారు చేయడం ద్వారా దానిపై విద్యార్థికి మరింత అవగాహన ఏర్పడుతుందని దాని ద్వారా సులువుగా సారాంశాన్ని అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి కూడా పోటీ తత్వాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని రకాల అంశాలతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, క్రమశిక్షణ, తదితర అంశాలలో కూడా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలియజేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధరకాల సైన్స్ ప్రాజెక్టులు తల్లిదండ్రులు, సందర్శకులను ఆలోచింప చేశాయి.

పల్స్పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పురపాలక సంఘ పరిధిలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పల్స్పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ ఛైర్పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పచ్చజెండా ఊపి ఎస్.ఎస్.ఎస్.ఎం., ఎన్.సీ. ఆర్.ఎం. పాఠశాలల ఎన్సీసీ విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేడు (ఆదివారం) పోలియో చుక్కలు వేయించాలని, పోలియో మహమ్మారిని తరిమివేయాలని కోరారు. పోలియో చుక్కలు వేయించడం వలన పిల్లల్లో అంగవైకల్యాన్ని నిరోధించ వచ్చని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని సెంటర్లలో ఏర్పాటు చేశామని, తల్లులు అశ్రద్ధ చేయకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డా.కారుమూరి హెలెన్ నిర్మల, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్స్, ఆషాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

"లాం" లో ఆగని అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర-తాడికొండ : మండల పరిధిలోని లాం గ్రామంలో అక్రమ నిర్మాణాలు ఆగటం లేదు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు మొత్తుకున్నా నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారుల మాటలు లెక్క చేయటం లేదు. నోటీసులు ఇస్తున్న వారి పని వారు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో ఇప్పటికే 30 మంది వరకు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. వారిలో 21 మందికి నోటీసులు అందజేశారు. మరికొంతమందికి నోటీసులు ఇవ్వవలసి ఉంది. అయినా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారంటూ గ్రామస్తులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూద్దాం.

వడ్డేశ్వరంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తాడేపల్లి : పోలియో చుక్కలు కార్యక్రమం విజయవంతం చేయాలని వడ్డేశ్వరం జడ్పీహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప అన్నారు. శనివారం వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వడ్డేశ్వరంలో పల్స్ పోలియో పై హెల్త్, అంగన్వాడీ, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సుబ్బారావు, జోజప్ప మాట్లాడుతూ మార్చి 3న ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. మార్చి నెల మొదటి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో రామచంద్రారెడ్డి, ఏఎన్ఎంలు శ్యామలాదేవి, రాధిక, రాజారత్నం, మాణిక్యం, లక్ష్మి తిరుపతమ్మ, ప్రసన్న కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరును అన్ని రంగాల్లో ముందుంచడమే ధ్యేయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు నగరానికి కొత్త రూపు తీసుకు రావడమే తమ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరంలోని నల్లచెరువు వాకింగ్ ట్రాక్ను శనివారం ఉదయం ఆమె సందర్శించారు. స్థానికులతో కలిసి ట్రాక్లో నడిచారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో మమేకమయ్యారు. వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరగా తప్పక చేయిస్తానని హామీ ఇచ్చారు. మరి కొందరు స్థానికంగా ఉన్న సమస్యలను ప్రస్తావించారు. వాటన్నింటిని సావధానంగా విన్న మంత్రి రజిని తనతో పాటు ఉన్న మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడుతో చర్చించారు. నల్ల చెరువు ప్రాంతంలో సమస్యలన్నింటిని తప్పక పరిష్కరిస్తామని మంత్రి, మేయర్ స్థానికులకు హామీ ఇచ్చారు.

టీడీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం : మంత్రి రజిని

మంత్రి రజిని మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూ ర్తిగా చేసి నగరాన్ని అధ్వానంగా తయారు చేసి వెళ్లారని దుయ్యబట్టారు. అప్పటి నాయకులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి ప్రజలకు నరకం చూపించారని ధ్వజమెత్తారు. మంత్రి వెంట స్థానిక కార్పొరేటర్ యోగేశ్వరరావు, రోషన్, ఖాజా, మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాబుతో నేను వాట్సాప్ గ్రూప్లో భాగస్వామ్యం అవ్వండి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నూతనంగా ప్రారంభించిన గుంటూరు తూర్పు బాబుతో నేను అనే వాట్సాప్ గ్రూప్లో నియోజకవర్గ ప్రజలందరూ భాగస్వా మ్యం కావాలని గుంటూరు తూర్పు టీడీపీ ఇన్చార్జ్ మొహమ్మద్ నసీర్ అన్నారు. దీనివలన ప్రతి ఒక్కరి సమస్యలను నేరుగా చంద్రబాబుకు చేరే విధంగా ఈ డిజిటల్ గ్రూప్ ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. స్థానిక 51వ డివిజన్ వెంగయ్య నగర్లో మహిళలు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. నసీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరుకి దీని గురించి చైతన్యం చేసి అందరూ ఈ గ్రూప్లో చేరే విధంగా టీడీపీ నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, శంకర్, గోళ్ళ ప్రభాకర్, గొట్టిపాటి వెంకట్రావు, గంగులూరి నవీన్, ఆనంద్, పొదిలి రమేష్, ఏలూరి నాగేశ్వరరావు, మల్లెంపూడి శ్రీనివాస్రావు, నాయుడు మధు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్గా అంకిరెడ్డిపాలెం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తాను పుట్టి పెరిగి ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అంకిరెడ్డిపాలెంను ఎడ్యుకేషన్ హబ్గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు రూరల్ పరిధిలోని అంకిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మున్నంగి సాంబిరెడ్డి దాతృత్వంతో మధ్యాహ్న భోజనశాల, మున్నంగి మాకిరెడ్డి, రామ్మోహన్రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు మున్నంగి కిషోర్రెడ్డి, మున్నంగి అంజిరెడ్డి, లీలా వర్ధన్రెడ్డి దాతృత్వంతో నిర్మించ తలపెట్టిన వాచ్మెన్ గది నిర్మాణపనులకు గ్రామ పెద్దలతో కలిసి అప్పిరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న ప్రగతిపనులను ఆయన పరిశీలించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఒక్క అంకిరెడ్డిపాలెం గ్రామానికే కాక చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులకు సైతం ఉపయుక్తంగా ఉండేలా జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలను అన్ని రకాల వసతులతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ షేక్ సుభాని, లేళ్ళపెద్ద అప్పిరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ మున్నంగి రమాదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ ఎగ్జిబిషన్లో మొదటిరోజు శనివారం ఉత్సాహభరితంగా సాగింది. ముఖ్యఅతిథిగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సాయివిజయ్ పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ని తిలకించారు. ప్రపంచం సైన్స్పైనే ఆధారపడి ఉందని, నేడు అంతరిక్షంలోకి అడుగు పెట్టడం వంటి ఎన్నో పురోగతులు సాధించినట్లు పేర్కొన్నారు. కేఎల్యూ ఇంజనీరింగ్ సైన్స్-2 హెచ్ఓడీ డాక్టర్ పీఎన్వీ బాల సుబ్రమణ్యం, అసోసియేషన్ డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ గంగిరెడ్డి సల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ డాక్టర్ విజయకృష్ణ పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ కేసు

విశాలాంధ్ర-తాడికొండ : అడ్డరోడ్డు సెంటర్లోని పున్నమి చెరువు వద్ద జరిగిన స్థల వివాదంలో ముగ్గురు వ్యక్తులపై తాడికొండ సీఐ ప్రభాకర్ రావు బైండ్ ఓవర్ కేసు నమోదు చేసిన సంఘటన సీఐ ప్రభాకర్ రావు తెలిపిన వివరాలు ప్రకారం గుంటూరుకు చెందిన అద్దంకి శ్రీకృష్ణ, గోరంట్లకు చెందిన ఎర్రంశెట్టి రవి పున్నమ్మ చెరువును కొనుగోలు చేశారు.

పరిశ్రమల సర్వే సక్రమంగా పూర్తి చేసేలా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పూర్తి చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె ఎస్ జవహర్ రెడ్డి కి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ కార్యాలయం వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, డీఆర్ఓ పెద్ది రోజాతో కలసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ లోకి జిల్లాలోని ఎంఎస్ఎంఈ పరిశ్రమల వివరాలు నమోదుకు నిర్వహిస్తున్న సర్వేపై సచివాలయ ఎమినిటీస్, ఇంజనీరింగ్ సెక్రటరీలకు శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. పరిశ్రమల శాఖతో పాటు, టెక్స్ టైల్, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖలను భాగస్వా మ్యం చేస్తూ సర్వేను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు మదనమోహన్శెట్టి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపికృష్ణ, సీపీఓ శేషశ్రీ, డీయంఅండ్హెచ్ఓ డా.విజయలక్ష్మీ, డీఐపీయం రత్నమన్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల సర్వే యాప్ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల పనితీరు మెరుగుపర్చి, ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ల సర్వేను నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్వేణుగోపాల్రెడ్డి ఎంఎస్ఎంఈల సర్వేయాప్ ప్రచార పోస్టర్ను పరిశ్రమల శాఖ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమును ప్రకటించిందని తెలిపారు. ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వేటీమ్లకు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఏటి అగ్రహారం ప్రజల చిరకాల వాంఛ తీరనున్న మెయిన్ రోడ్డు విస్తరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఏటి అగ్రహారం ప్రధాన రహదారి నిర్మాణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడుదల రజిని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుతో కలిసి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని వారికి ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఏటి అగ్రహారం ప్రజల చిరకాల వాంఛ అయిన మెయిన్ రోడ్డు అభివృద్ధి విస్తరణ పనులు రూ.22 కోట్లతో చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. త్వరలో శంకుస్థాపన చేస్తామని, ఈ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్ కుమార్, వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు అంగడి శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో నగర్ కార్మికులకు బాసటగా నిలుస్తా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆటో నగర్లోని కార్మికులకు బాసటగా నిలబడి వారి సంక్షేమానికి కృషి చేస్తానని గుంటూరు తూర్పు నియోజకవర్గం ఏపీ ఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అల్తాఫ్ అన్నారు. శనివారం ఆయన ఆటో నగర్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షేక్ అల్తాఫ్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా ఆటోనగర్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, ఇక్కడ రోడ్డు, వైద్యం, పారిశుధ్యం వంటివి ప్రజలను పట్టిపీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తనను గెలిపిస్తే ఆటో నగర్ను శాశ్వత ప్రాతిపదికన త్రాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తానని ఆయన చెప్పారు. ఇక్కడ రోడ్లు, సైడు కాలువలు లేని కారణంగా వర్షంపడితే ఆటో నగర్లో షాపుల్లో నీరు వచ్చే పరిస్థితి ఉందని, తద్వారా ఇక్కడి కార్మికులు అనారోగ్యాలు మారిన పడుతున్నారని చెప్పారు. సైడ్ కాలువలు ఏర్పాటు చేసి రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఏపీ ఆర్ఎస్ పార్టీ తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగడానికి బాధ్యత తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులది కీలక పాత్ర అని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సెక్టోరల్ అధికారుల ఎన్నికల సజావుగా జరగడానికి బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. సాధారణ ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్ పశ్చిమ నియోజక వర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మీతో కలిసి శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఓ నిరంజన్, ఏఈ ఆర్ఓ ప్రదీప్ కుమార్, ఎన్నికల విభాగ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా 'దాసరి దరియ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా దాసరి దరియా నియమితులయ్యారు. శనివారం విజయవాడ ఐలాపురం హోటల్ నందు బీసీ సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. బీసీ కులాల జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. దాసరి దరియ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి దాసరి దరియను అభినందించారు. దాసరి దరియ మాట్లాడుతూ గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా నియమించిన సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు వైఎస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థుల మార్కులను వెబ్సైట్లో నమోదు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ శనివారం పట్టిచెరుకూరు మండలం, పుల్లడిగుంట ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ టోఫెల్ విద్యా బోధన ఎలా జరుగుతుందో పరిశీలించారు. స్టూడెంట్స్ వర్క్ బుక్స్ నోట్స్ పరిశీలించారు. ఎఫ్ఏ-4 పరీక్షా ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. తర్వాత ఎఫ్ఏ-4 పరీక్షలలో తరగతి టాపర్స్తో ఫోటో దిగి వారిని అభినందించారు. జిల్లాలోని ఉపాధ్యాయులం దరూ ఎఫ్ఏ-4 పరీక్షా ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు ఇచ్చి తరగతి టాపర్స్తో సెల్ఫీ/ఫోటో దిగాలని, అలాగే విద్యార్థుల మార్కులను వెబ్సైట్లో నమోదు చేయాలని సూచించారు.

బోర్వెల్ నిర్మాణం

విశాలాంధ్ర-తాడేపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు ఆర్థిక సహకారంతో శనివారం వడ్డేశ్వరంలో లక్ష రూపాయలు విలువగల బోర్వెల్ నిర్మాణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వడ్డేశ్వరం గ్రామ పార్టీ అధ్యక్షులు ఈపూరి బాబు, ముళ్ళపూడి విక్టర్ సాయి, చావలి సురేష్, షేక్ నాగూర్ వలి, షేక్ ఇమామ్, సుగుణాకర్, షేక్ మస్తాన్, రూతు, చిన్ని, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎన్ఫోర్స్మెంట్ బృందాలైన ఫ్లయింగ్ స్క్వాడ్టీం (ఎఫ్ఎస్టీ), స్టాటికల్ సర్వేటీం (ఎస్ఎస్టీ)లు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్లోని శంకరన్ హాలులో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఎన్ఫోర్స్మె ంట్ టీంలలో నియమించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ పాల్గొన్నారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థులు అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) స్వాతి, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో నియమించిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు: వివిధ కారణాలతో సహాయం కోసం ముఖ్య మంత్రి రిలీఫ్ ఫండ్ కోసం ఆశ్రయి ంచిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శనివారం పార్టీ కార్యాల యంలో చెక్కులు అందజేశారు. పెద కూరపాడు మండల పరిధిలోని గారపాడుకు చెందిన వేములరి మల్లిఖార్జునరావుకు రూ.2 లక్షలు, పెదకూరపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన సుంకర అచ్చయ్యకు రూ.1.30లక్షలు, అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణమూర్తికి రూ.1.10లక్షలు, క్రోసూరుకు చెందిన చిలకా రెబ్బమ్మకు రూ.40 వేలు, క్రోసూరు మండలం 75 తాళ్లూరుకు చెందిన ఊర అఖిల్‌కు రూ.22 వేలు, పెదకూరపాడు మండలం కంభం పాడుకు చెందిన గోగులపాటి యశ్వంత్‌కు రూ.35 వేలు, పెదకూరపాడుకు చెందిన ఆల రాణి గంగ మ్మకు రూ.18 వేలు, క్రోసూరుకు చెందిన బోడె అప్పారావుకు రూ.65 వేలు, పెదకూరపాడు మండలం బలుసుపాడుకు చెందిన ఏపూరి నాగేశ్వర రావుకు రూ.50 వేలు, పెదకూరపాడు మండలం లింగంగుంట్లకు చెందిన ఎండ్లూరు ఠాగూర్ చౌదరికి రూ.40 వేలు, పెదకూరపాడు మండలం పాటిబండ్లకు చెందిన సయ్యద్ రహీమ్‌కు రూ.75 వేలు, గుంటూరుకు చెందిన కన్నుగంటి ఏకోబుకు రూ.60వేలు, ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడుకు చెందిన గుమ్మడి రాణికి రూ.40 వేలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యులు కంకణాల స్వర్ణకుమారి శివాజీ శ్రీనివాసరావు, రామాపురం సర్పంచి ఏసురత్నం, మాజీ సర్పంచి గణేష్, మాధవరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ర్యాలీ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమమును జయప్రదం చేయాలంటూ శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి గ్రామంలో ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పోలియో రహిత సమాజమునకు సహకరిద్దాం, పల్స్ పోలియో కార్యక్రమం జయప్రదం చేయాలంటూ విద్యార్థులు, వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. పల్స్ పోలియోపై గ్రామస్థులకు అవగాహన కలిగించారు. తల్లిదండ్రులు తమ 0 నుంచి 5 సంవత్సరములలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో రహిత సమాజమునకు సహకరించాలని కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎన్.సాయిబాబు, డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పదాల చక్రారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై అంబటి సవారీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి అంబటి రాంబాబు శనివారం పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లో రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్‌పై ప్రయాణించారు. ప్రతినిత్యం అనుచరగణంతో, సైరన్ వాహనాలలో ప్రయాణించే మంత్రి ఒక్కసారి ద్విచక్ర వాహ నంపై పట్టణంలో ప్రయాణించడం ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. గత కొన్ని రోజులుగా అంబటి పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. టీ దుకాణంలో టీ తయారు చేయటం, టిఫిన్ బండి మీద దోశలు వేయటం, ప్రైవేట్ హాస్పిటల్‌లో వ్యక్తి గతంగా వైద్యులను కలుస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. శనివారం బైక్‌పై అంబటి సవారీ పలువురు ఆసక్తిగా తిలకించారు.

టీడీపీలో కదనోత్సాహం

విశాలాంధ్ర-రెంటచింతల : మండల టీడీపీలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఇటీవల వైసీపీకు, పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసిన శ్రీకృష్ణదేవ రాయలు గురజాల నియోజకవర్గంలో శనివారం జరగనున్న రా.. కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్న తరుణంలో టీడీపీ శ్రేణులు హర్షిస్తూ కదనోత్సవంతో సభకు తరలివెళ్లాయి. టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నేతలు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరారు. అబ్బిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్య మంత్రిగా చేయడమే లక్ష్యంగా నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానంద రెడ్డి గెలుపుకు కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. రా.. కదలిరా సభకు తరలివెళ్ళిన వారిలో టీడీపీ సీనియర్ నేత దండే శివయ్య, సుమంత్ రెడ్డి, మూలి రాజారెడ్డి, ఎస్సీ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి రవి, రైతు విభాగం నేత చేర్రెడ్డి కృష్ణారెడ్డి, ఆవుల చిన వెంకటేశ్వర్లు, బుజ్జి, రాజ్ కుమార్, ప్రభురాజు, మల్లయ్య, ముని నాయక్, మల్లయ్య యాదవ్, చిన సామియేలు, కుమార్, నారాయణపురం శ్రీనివాసరావు, మరియదాసు, సిద్దయ్య, మారం శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రజా సేవకుడిగా మీకు అండగా ఉంటా...

విశాలాంధ్ర-సత్తెనపల్లి : చెప్పులు కుట్టిన అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడయ్యాడని, రైలులో టీ అమ్మిన నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా ఆదరించారని వారి స్ఫూర్తి సామాన్యుడైన నేను రాజకీ యాల్లోకి వచ్చానని వారివలే నన్ను ఆశీర్వదించాలని న్యాయవాది, జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్ కుమార్ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పురవీధుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజా సేవకు కులం, మతం, అంగ, అర్థ బలం అవసరం లేదన్నారు. కృషి, పట్టుదల, అంకితభావంతో పనిచేస్తారనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగితే తప్పక ఆదరిస్తారని, అందుకు లింకన్, మోదీలే నిదర్శనమని అన్నారు. స్టేట్ బ్యాంక్ రోడ్డులో టిఫిన్ బండి వద్ద అట్లు పోశారు. ఎన్జీవో హోమ్ సెంటర్‌లో టీ పెట్టి అందరికి ఇచ్చారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం చెరుకు రసం తయారు చేసి పలువురికి పంపిణీ చేశారు. మెయిన్ రోడ్డులో చెప్పులు కుట్టి, బూట్లు పాలిష్ చేసి చర్మకారుల సమస్యలు అడిగి తెలుసుకొని వారికి అండగా ఉంటానంటూ హామీఇచ్చారు.

మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన ఈఓ, సీఐ

విశాలాంధ్ర-అమరావతి : శైవ క్షేత్రాలలో అగ్రగామిగా వెలుగొందుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో కొలువుతీరి ఉన్న శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామివార్ల మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఈ నెల 8వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకొని అలాగే 10వ తేదీ స్వామివారి కళ్యాణ మూర్తుల రథోత్సవ కార్యక్రమ నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలో అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్న ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షణ నిర్వహిస్తూ వివిధ ప్రాంతాలైన క్యూ లైన్స్, టికెట్ కౌంటర్స్, దర్శన ఏర్పాట్లు, స్నాన ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ రెగ్యులేషన్ తదితర ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి గోపి, అమరావతి పోలీస్ స్టేషన్ సీఐఏవీ బ్రహ్మం, ఎస్ఐలునరసింహులు, ప్రసాద్‌రెడ్డిలు పరిశీలించారు.

నరహంతకులని అణగదొక్కుతా...

- పల్నాడుకు పూర్వవైభవం తెస్తా
- రా... కదిలా రా... సభలో చంద్రబాబు

విశాలాంధ్ర-గురజాల : గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో మరీ ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో జరుగుతున్న రాక్షస పాలనను 2024 ఎన్నికల తర్వాత తెలుగుదేశం-జనసేన అధికారం లోకి వచ్చిన వెంటనే పల్నాడు ప్రాంతంలోని నరహ ంతకులను అణగద్రొక్కి పల్నాడు ప్రాంతానికి పూర్వవైభవం తెచ్చే విధంగా కృషి చేస్తానని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం నియో జకవర్గంలోని దాచేపల్లిలో ఏర్పాటు చేసిన రా కదిలిరా బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి గురజాలలో 11 మందిని, మాచర్లలో ఎనిమిది మందిని జిల్లా మొత్తంలో దాదాపు 30 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అన్యాయ ంగా హతమార్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చంద్రబాబు హెచ్చరించారు. ఇటీవల వైఎస్సార్ పార్టీకి రాజీనామా చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలును, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులను మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు దేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాస రావు, ఆలపాటి రాజా, పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ అరవింద్ బాబు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, కొమ్మాలపాటి శ్రీధర్, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వర్లు, భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా లావు:

ఇటీవల వైసీపీ పార్టీకి రాజీనామా చేసి శనివారం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన లావు శ్రీకృష్ణదేవరాయలును నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. లావు మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం 50 రోజులకు వ్యవధి మాత్రమే ఉందని, ఈ 50 రోజులు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి తెలుగుదేశం-జనసేన కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. గడచిన ఐదు సంవత్సరాలలో పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేశానని గర్వంగా చెప్పుకుంటానని, మాచర్ల-వినుకొండ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ నున్న వరికేపూడిశెల ప్రాజెక్టుకు ఫారెస్ట్ అనుమతులను తీసుకురావడం జరిగిందని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మూడు మెడికల్ కళాశాల మంజూరు చేస్తే అందులో ఒకటి పల్నాడు ప్రాంతానికి తీసుకురావడం జరిగిందన్నారు. రూ.3 వేల కోట్లతో హైవేల నిర్మాణం చేపట్టడం జరుగు తుందని, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతు ందనే ధ్యేయంతో నకరికల్లు ప్రాంతంలో ఇజ్రాయిల్ ప్రభుత్వం తో ప్రాజెక్టు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

రానున్న రోజుల్లో వైసీపీ సైకోలకు బుద్ధి చెప్తాం: మాజీ ఎమ్మెల్యే యరపతినేని

రానున్న తెలుగుదేశం-జనసేన కూటమి విజయంతో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికార మదంతో విర్రవీగిన ప్రతిఒక్క వైసీపీ సైకోలకు కచ్చితంగా బుద్ధి చెప్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. శనివారం నియోజకవర్గంలోని దాచేపల్లిలో మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి దాదాపు 11 మంది టీడీపీ కార్యకర్తలను అన్యాయంగా హతమార్చారని, దోషులు ఎంతటి వారైనా రానున్న రోజుల్లో చట్టపరంగా శిక్షిస్తామన్నారు.

గురజాల టికెట్‌పై సస్పెన్స్: 'రా కదలి రా...' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు గురజాల టికెట్ అనౌన్స్ చేసి గతకొంత కాలంగా కొనసాగుతున్న ఉత్కంఠతకు తెరదించుతారని ఆశగా ఎదురుచూసిన టీడీపీ శ్రేణులు, కార్యకర్తల్లో కొంత నిరాశ నెలకొంది. యరపతినేనికి టికెట్ వస్తుందా.. రాదా అనే సందిగ్ధంలో యరపతినేని అభిమానులు ఉన్నారు. యువనాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలును నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రజలు ఆశీర్వాదం ఇవ్వాలని చెబుతూనే పార్టీకి సేవలందించిన యరపతినేనిని మర్చిపోనంటూచంద్రబాబు చెప్పుకొచ్చారు.

విద్యార్థులతో డే విత్ కలెక్టర్ కార్యక్రమం : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాటశాలలో 10వ తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులతో డే విత్ కలక్టర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమములో అమరావతి, పెద కూరపాడు, చిలకలూరిపేట తదితర ప్రాంతాలనుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులు సుమారు 241 మంది పాల్గొన్నారు. తొలుత వారి నుండి వారి అభిప్రాయాలు, లక్ష్యాలు తదర అంశములపై వ్రాత పూర్వకంగా వివరాలు సేకరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వారి వారి అభిప్రాయాలకు తగ్గట్టుగా ఏ ఏ పరీక్షలు ఎలా రాయాలి, ఎలా సన్నద్ధం కావాలి అనే విషయాలను సవివరముగా వివరించారు. పలువురు విద్యార్థులు పలు ప్రశ్నలు కలెక్టర్‌కు సంధించి సమాధానాలు రాబట్టారు. తోలుత యన్.ఈ.సి ఇంజనీరింగ్ కాలేజి ప్రినిపాల్ శ్రీనివాస కుమార్ 10వ తరగతి పరిక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై విద్యార్థులుకు స్ఫూర్తి కలిగించారు. కార్యక్రమములో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా విద్యా శాకాదికారి వెంకటేశ్వర్లు, ఉప విద్యా శాఖాధికారి వేణు గోపాల్, విద్యార్థిని విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా సభకు తరలి వెళ్లిన టీడీపీ - జనసేన శ్రేణులు

విశాలాంధ్ర-వినుకొండ : దాచేపల్లిలో నిర్వహించిన రా.. కదలిరా.. బహిరంగ సభకు వినకొండ నియోజకవర్గం నుండి పలనాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వేలాదిగా తరలివెళ్లారు. సభకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హాజరవు తున్నడంతో నియోజకవర్గంలోని బొల్లాపల్లి, శావల్యాపురం, నూజె ండ్ల, ఈపూరు, వినుకొండ మండలాల నుండి సుమారు 700 వాహనాల్లో పదివేలకు పైగా ప్రజలు తరలివెళ్లారు. నరసరావుపేట రోడ్ల గల సాయిబాబా గుడివద్ద భోజనాలు ఏర్పాటు చేయగా మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జున రావు, జీవీ ఆంజనేయులు సత్రీమణి శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి కార్లు పాల్గొని ప్రారంభించారు. సభకు సంఘీభావంగా వినుకొండ పట్నంలో టీడీపీ - జనసేన శ్రేణులు భారీగా వాహనా లతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో దీనితో వినుకొండ పట్టణంలో టీడీపీ జనసేన శ్రేణులు కథనోత్సవంతో కదం తొక్కి తరలి వెళ్లారు.

ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చర్మకార భవన్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట వద్ద నూతనంగా నిర్మించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చర్మకార భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు ఆర్కే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఎక్కడో బీహార్ రాష్ట్రంలోని నిరుపేద కుటుంబంలో జన్మించి, భారత ఉప ప్రధానిగా పదవి బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా అనేక ప్రభుత్వ కీలక శాఖలలో తన ప్రతిభ కనపరిచిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ పేరు మీద చర్మకార షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకర పరిణామం అని అన్నారు. ప్రస్తుతం 10 షాపులలో సముదాయం ప్రారంభోత్సవం జరిగిందని, రానున్న రోజులలో రెండవ అంతస్తు నిర్మాణం జరిపి మరొక 10 షాపులు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్ల రాజారావు, వైసీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, ఆదాము, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొడదాం...

- పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాదరావు

విశాలాంధ్ర-దుర్గి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో కార్మిక, రైతు, ప్రజా సంక్షేమం కరువైం దని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వర ప్రసాదరావు, జిల్లా సహాయకార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాల యంలో టౌన్ సెక్రెటరీ కాలా శివయ్య అధ్యక్షతన జరిగిన ఏరియా కౌన్సిల్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధాని మోడీ పాలనలో అభివృద్ధి శూన్యం అన్నారు. ప్రజా సంక్షేమానికి పాటు పడాల్సిన ప్రభుత్వాలు కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశంలోని ప్రభుత్వ రంగాన్ని కారు చౌకగా అంబానీ ఆదానీలకు ఒప్ప చెబుతున్నారని కార్మిక హక్కులను దుర్మార్గంగా కాలరాస్తూ నియంతృత్వంగా వ్యవహరిస్తు న్నారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సామా న్యుడు వాడుకునే నిత్యావసర సరుకుల వస్తువుల ధరలు పరీతంగా పెరిగిపోయా యని వారు విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించిన ప్రభుత్వాలు అధికారం చేపట్టాక మొండిచేయి చూపించటం ఆనవాయితీగా మారిందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రధాని మోడీతో చీకటి ఒప్పందాలు చేసుకొని రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాడన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు పరిశ్రమపై ఎందుకు నోరు మెదపడం లేదో సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపనతో పాటు పనులు ప్రారంభమంటూ చేసిన వాగ్దానాలు నీటి మూటలుగా మిగిలాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలన సాగిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలని రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు ప్రజల వద్దకు వెళ్లి విరా ళాలు వసూలు చేయాలని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల, దుర్గి, కారంపూడి, రెంటచింతల కార్యదర్శులు మిద్దె పోగు బాబురావు, కాలా శివయ్య, షేక్ సైదా, కేతావత్ రంగ నాయకులు, జిల్లా మహిళా అధ్యక్షులు నాగమణి, చిట్టిప్రోలు ఆంజనేయులు, అమరే శ్వరరావు, గుండ్ల అమ్మోరయ్య, వేముల గర్తారావు, భక్తుల బుదయ్య, కొణతం దావీదు, నర్రా రంగస్వామి, పఠాన్ జాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కన్నా చెంతకు కరీముల్లా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరీముల్లా శనివారం మాజీ మంత్రి నియోజకవర్గ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు మద్దతు ప్రకటించారు. పట్టణంలోని 27వ వార్డులో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ పెద్ద కరీముల్లా ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గతంలో కోడెల ముఖ్య అనుచరుడుగా పనిచేసిన కరీముల్లా కోడెల అనంతరం ఆయన కుమారుడు శివరాంకు మద్దతుగా ఉన్నారు. ఇటీవల ప్రకటించిన నియోజక వర్గ అభ్యర్థుల్లో కన్నాను సత్తెనపల్లి సీటుకి చంద్రబాబు ప్రకటించటంతో పార్టీకి విధేయుడిగా ఉండే కరీముల్లా శనివారం పార్టీ నిర్ణయానికి కట్టుబడి కన్నాను తన వార్డుకి ఆహ్వానించారు. కరీముల్లా చేరికతో బలమైన ముస్లిం వర్గం కన్నా వెంట నిలబడటం విశేషం. రాష్ట్ర, జిల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసమ్మకు నివాళులర్పించిన కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం గ్రామంలో కోర్ని నరసమ్మ మరణించిన వార్త తెలుసుకొని వారి పార్థివదేహానికి మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నియోజవర్గ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర-నకరికల్లు : బాలల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని ఎస్వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చేజర్ల ప్రధానోపాధ్యాయని షేక్ షాహీం తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో నుంచి విముక్తి కల్పించడానికి రెండు పోలియో చుక్కలు మార్చి మూడవ తేదీ ఆదివారం తీసుకోవాలని ఆమె కోరారు. శనివారం పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీని చేజర్ల గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది కలసి నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు ఇప్పించాలని ఏఎన్ఎం పి.కుమారి తెలిపారు. ప్రతిసారి రెండు చుక్కలు పోలియోపై నిరంతరంగా విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు షేక్ మస్తాన్‌వలి, చెరుకూరి వెంకటేశ్వర్లు, గేరా మోహన రావు, ఆశాకార్యకర్తలు మరియమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరుణాలకు రూ.30 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రభుత్వ పండుగగా గుర్తించిన కోటప్ప కొండ తిరుణాల మహోత్సవం ఏర్పాట్ల కోసం ప్రభుత్వం 30 లక్షల రూపాయలు నిధులను శనివారం మంజూరు చేసిందని దేవాలయం కార్యనిర్వహణ అధికారి జి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో జరిగే త్రికోటేశ్వర స్వామి తిరుణాల మహోత్సవాన్ని 2008వ సంవత్సరం నుండి ప్రభుత్వ పండుగగా గుర్తించి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషితో కోటప్పకొండలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు ఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మార్చి మూడో తేదీ నుండి దేవాలయంలో యజ్ఞాలు, ప్రత్యేక పూజలు దేవాలయం వెనుక ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు.

రా కదలిరా సభకు బయలుదేరిన పసుపు దళం

విశాలాంధ్ర-పెదకూరపాడు: గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన రా కదలిరా బహిరంగ సభకు పెద కూరపాడు మండలం నుంచి పసుపుదళం భారీ ఎత్తున బయలు దేరారు. మండల పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేష్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ముస్లిం మైనార్టీలు మేము సైతం రా కదిరి రా బహిరంగసభకు సభకు తరలివస్తామంటూ దండోపతండాలుగా బయలుదేరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జులు వడ్లమూడి అప్పారావు, అజుముల్లా, సురేష్, భాష, ఆంజనేయులు, బెల్లంకొండ రాంగోపాల్రావు, భావన, రాంబాబు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నూతన బోర్ బావి తవ్వకం ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : నూతన బోర్ బావి తవ్వకాన్ని మార్కెట్ యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్ శనివారం ప్రారంభించారు. మండల కేంద్రమైన దుర్గి యాదవుల బజారులో వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నూతన బోర్ బావి ఏర్పాటు తలపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయపాటి మాణిక్యం, జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, కటకం చినవెంకటయ్య, యకటీల బుచ్చిబాబు, తోటకూర చినవెంకటేశ్వర్లు, జంగా కొండలు, కరెంట్ గోపాల్, చింతా రామకృష్ణ, చాట్ల రమేష్, యకటీల చిన్నబాయి, అమర్ షా, జంగా శ్రీను, పగడాల యల్లమంద తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను మెరుగుపరిచేందుకు "ర్యాంక్ అటైన్మంట్ ప్రోగ్రాం"

విశాలాంధ్ర-వినుకొండ : పదవ తరగతి విద్యార్థులలో ఉన్న ప్రతిభ మరింతగా మెరుగుపరిచేందుకు ర్యాంక్ అటైన్మంట్ ప్రోగ్రాం దోహద పడుతుందని మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా అన్నారు. నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె. వేణుగోపాల్ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలలో చదువుతున్న టాప్ 4 (ప్రతి పాఠశాల నుండి నలుగురు విద్యార్థిని విద్యార్థులు) చొప్పున సుమారు 120 మంది 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు లయోలా పాఠశాలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. నరసరావుపేట డివిజన్‌లో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించుటకే ర్యాంక్ అటైన్మంట్ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. 2వ తారీఖున విషయ నిపుణులు లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించగా 3వ తారీఖున తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులు బోధించనున్నారు. లయోలా ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానో పాధ్యాయులు ఈ.వి.రాం బాబు, ప్రోగ్రామ్ సమన్వయకర్త సి.హెచ్. వీరప్పయ్య ఉపాధ్యాయులు కే. శ్రీనివాస రాజు, జి. సి.హెచ్. గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గిరజన మహిళ అంత్యక్రియలు

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలో మల్లవరం టీడీపీకి చెందిన గిరిజన మహిళ బాణావత్ సామునిబాయి అంత్యక్రియలు ప్రశాంతంగా శనివారం సాయంత్రం ముగిశాయి. శుక్రవారం వైసీపీకి చెందిన డ్రైవరు వడితె మణిరంతనాయక్ మంచినీటి ట్రాక్టరును ఢీకొట్టిన సంగతి పాఠకులకు విదితమే. భాదితురాలు సామునిబాయిని వెంటనే మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్‌లో తీసుకెళ్లారు. చికిత్స చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే మృతిచెందింది. శవపంచనామా ఆలస్యం కావటంతో శనివారం ముగించారు. బాధిత కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పల్స్ పోలియో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాధమిక పాఠశాల ఆవాస ప్రాంతంలో విద్యార్థులుచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రజక కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జి.నాగలక్ష్మి హాజరై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ళ లోపు పిల్లలకు అందరినీ పోలియో చుక్కల కేంద్రం వద్దకు తెచ్చి పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో మహమ్మారిని దేశం నుంచి పారద్రోలాలంటే అందరం చేయి చేయి కలిపి ఐక్యంగా కృషి చేయాలని కోరారు. బస్టాండ్ అన్ని పాఠశాలలు ఆరోగ్య కేంద్రాలు, అన్ని సెంటర్‌లలో, పాఠశాలల్లో ఈ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పోలియో ఆదివారం మార్చి 3వ తేదీ అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. విద్యార్థులు ర్యాలీలో నినాదాలు చేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు. రండి రండి అందరం కలిసి పోలియోను పారద్రోలదాం. ఈ ర్యాలీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుధ, ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, వార్డు ఏఎన్ఎం జి.ఆది లక్ష్మి, ఆశ కార్యకర్త వి.రాజేశ్వరి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా గీతాంజలి 10వ విద్యార్థుల వీడ్కోలు

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక గీతాంజలి స్కూల్ నందు 10 విద్యార్థుల ఫేర్ వెల్ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ దస్తగిరి షకీలా బేగం, పట్టణ సీఐ ఎస్. సాంబశివరావు, కౌన్సిలర్ బాషా తదితరులు పాల్గొని 10వ తరగతి పరీక్షలు వ్రాయబోవుచున్న విద్యార్థులకు శుభాకాంక్షలు అందించారు. బ్రహ్మనాయుడు మాట్లాడుతూ చిన్నారులు చదువు విలువ తెలుసుకొని మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అని పిలుపు నిచ్చారు. అలాగే ఈ తాతయ్య ఆశీస్సులు ఎప్పుడు మీకు ఉంటాయి అని తెలిపారు. షకీలా బేగం మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారానే అనుకున్న లక్ష్యాలు సాధించగలు గుతారు అని కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థికి విద్యతో పాటుగా మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలి అని కోరారు. భాషా మాట్లాడుతూ ప్రతి ఏదాది లనే ఈ ఏదాది కూడా మంచి ఫలితాలు సాదించాలి అని కోరారు.గత సంవత్సరం 10వ తరగతిలో 550 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల నగదు పురస్కారాలు అందిం చారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి తేళ్ళ కృష్ణవేణి, కారాస్పాండంట్ శ్రీ వై యల్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము-సత్తెనపల్లి

ఆర్.ఓ.సి.నెం. 106/2019/ఎ1 తేది : 29-02-2024

బహిరంగ వేలము ప్రకటన

సత్తెనపల్లి పురపాలక సంఘ యాజమాన్యమునకు చెందిన, ఈ దిగువనుదహరించిన మార్కెట్లులలో, **2024-2025** ఆర్థిక సంవత్సరము అనగా **ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు (12నెలలు)** రుసుము/ ఆశీలు వసూలు చేసుకొను హక్కుకై **ది.13-03-2024, బుధవారం ఉదయం గం.11.00 లకు** మునిసిపల్ కార్యాలయములో మున్సిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారిచే అనుమతి పొందిన వారిచే గాని అవసనమైన యెడల తదుపరి దినములలో బహిరంగ వేలము నిర్వహించబడును. మార్కెట్ గజిట్ నోటిఫికేషన్ నెం. **18, తేది. 30-01-2024**నందలి షరతులు మరియు నిబంధనలకు లోబడి బహిరంగ వేలం పాట నిర్వహించడును. పూర్తి వివరములకు ఈ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవలెను.

వరుస సంఖ్య	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము (రూ)	దాఖలు పరచవలసిన సాల్వెన్సీ మొత్తం (రూ)	జమ చేయవలసిన నాన్- రిఫండబుల్ మొత్తము (రూ)
1	2	3	4	5
1	రాజీవ్ గాంధి కూరగాయల మార్కెట్ రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.4,00,000/-	రూ.5,00,000/-	రూ.7,000/-
2	సంత్రీ మార్కెట్ రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.3,00,000/-	రూ.4,00,000/-	రూ.5,000/-
3	జంతువధశాలలు రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.10,000/-	రూ.20,000/-	రూ.3,000/-
4	మాంసము మరియు చేపల మార్కెట్ నందు రుసుము వసూలు చేసుకొనే	రూ.15,000/-	రూ.30,000/-	రూ.3,000/-
5	ప్రవేట్ బస్ స్టాండ్ ఫీజులు వసూలు చేసుకొనే హక్కు	రూ.3,00,000/-	రూ.3,00,000/-	రూ.5,000/-
6	శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య మెమోరియల్ పార్కు క్యాంటిన్ (టీ స్టాల్)	రూ.1,50,000/-	రూ.50,000/-	రూ.1,000/-

సం/- కొలిమి షమ్మి, కమీషనరు
సత్తెనపల్లి పురపాలక సంఘం